క్లుప్తంగా

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం

చీరాల రూరల్: హెచ్ఐవీ బాధితులకు అండగా నిలబడటం మన బాధ్యతని మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా మండలి చీరాల, ఏపీఎస్ఏసీఎస్, టీఐ ప్రాజెక్టు, ఆశా రేఖా మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో లక్ష్మీ పద్మావతి చేతులు మీదుగా 20 మంది హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలిసో తెలియకో కొంతమంది హెచ్ఐవీ మహమ్మారి బారినపడుతున్నారని, అటువంటి వారిని మనం అక్కున చేర్చుకుని వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరెడ్డి, ఎస్. నాగేంద్రమ్మ, పార్వతి, మాధవి, లక్ష్మి, జయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

చీరాల: మున్సిపాలిటీలోని కూరగాయల మార్కెట్, మున్సిపల్ వ్యాపార సముదాయాలు, వార్డుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యనిస్తున్నామని నూతన మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్, అంబేడ్కర్ భవనం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాపార సముదాయాల వద్ద అపరిశుభ్రంగా ఉండటంపై శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యానికి భంగం వాటిల్లేలా అపరిశుభ్ర వాతావరణం లేకుండా విధులు నిర్వహించాలని, పరిశుభ్రతకు అధిక ప్రాదాన్యమిచ్చి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సిబ్బంది కమిషనర్ పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం మోహన్

మార్టూరు: ప్రకృతి వ్యవసాయంలో రైతులకు మరింత అవగాహన కల్పించాలని ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. స్థానిక మండల సమైఖ్య కార్యాలయంలో 13 మండలాలకు చెందిన కృషి, సఖిలకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందికి ఆధునిక శాస్త్రీయ సాంకేతిక పద్ధతిలో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారత్నం, టీమ్ లీడర్ రాజశేఖర్, లక్ష్మీ ప్రసన్న, వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, అప్పారావు, భారతి, 13 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేయాలి



పాలక మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర

యద్దనపూడి: నూతనంగా నియమించిన పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి పారదర్శకంగా కృషి చేయాలని అద్దంకి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పూనూరు వీరభద్రస్వామి నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా బత్తుల ఆంజనేయప్రసాద్, సభ్యులుగా ఈదల లలిత, పత్తిపాటి పార్వతి, నిడమానూరి నాగేశ్వరావు, బోయపాటి రామయ్య, దన్నవరపు పద్మలచే ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రమాణం చేయించారు. ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా మూలంరాజు రాజ్‌కుమార్‌శర్మ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, రికార్డు అసిస్టెంట్ రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు మరువలేనివి

చీరాల రూరల్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 90వ జయంతి వేడుకలను శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో కాన్షీరాం విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాన్షీరాం బహుజనులకు రాజ్యాధికారం అందించేందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కేవలం సైకిల్ యాత్రచేసి బహుజనులను చైతన్య పరిచి బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారని చెప్పారు. దేశంలో అతిపెద్ద రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారాన్ని బహుజనులకు అందించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ సెంట్రల్ జోన్ కో ఆర్డినేటర్ జగన్‌మోహన్, భగత్‌సింగ్, గొర్రెపాటి రవికుమార్, దుడ్డు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని పథకాలు మన రాష్ట్రంలో

- మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిదీ
- ఎమ్మెల్యే కరణం బలరాం, కరణం వెంకటేష్



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం, వెంకటేష్

చీరాల టౌన్: దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. మండలంలోని తోటవారిపాలెం గ్రామసచివాలయం-1 ప్రారంభోత్సవంతో పాటుగా తోటవారిపాలెంలో రూ.3.56 కోట్లతో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి గ్రామంలో నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం అయ్యారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తామంతా సంతోషంగా ఉన్నామని, కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన సహకారం మరువలేమన్నారు. వలంటీర్ల ద్వారా రాజకీయాలకు అతీతంగా నేరుగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. కంటికి రెప్పలా కాపాడుతున్న జగనన్నకు తాము అండగా ఉండి సీఎంగా జగనన్నను, చీరాల ఎమ్మెల్యేగా సమన్వయకర్త వెంకటేష్‌ను గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుతూ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా భావించి సమర్థవంతమైన పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకునేందుకు అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు.



కార్యక్రమానికి భారీగా హాజరైన మహిళలు

ఫ్యాన్ స్పీడ్‌కు ఏ పార్టీలు తట్టుకోలేవు..

సమన్వయకర్త వెంకటేష్ మాట్లాడుతూ ప్రతీ గడపలో ఆనందం వెల్లివిరిసేలా సంక్షేమ పాలన అందించిన జగనన్నకు అందరం అండగా ఉండి మళ్లీ జనరంజక జగనన్న ప్రభుత్వాన్ని తీసుకోచ్చుకుందామన్నారు. ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని, కొద్దిజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ స్పీడ్‌ను తట్టుకునే పార్టీలు లేవని ఎద్దేవా చేశారు. ఓటర్లు జగనన్నను సీఎంగా మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు అన్నీ వర్గాలను ఆదరించి అక్కున చేరాయని ప్రతి పౌరుడి సంక్షేమాన్ని చూపిన వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. అనంతరం సచివాయలాన్ని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు అసోది అంకాళరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎన్.రాజ్‌కుమార్, నాయకులు శివపార్వతి, వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, పి.ధనుంజయ్, అశోక్, హరీష్, హనుమంతరావు, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్, రత్నారెడ్డి, వెంకటేశ్వరమ్మ, జయరావు, శ్రీనివాసరావు, అధికసంఖ్యలో ప్రజలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న యడం బాలాజీ

యద్దనపూడి: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామానికి చెందిన మార్నెళ్ల విజయకృష్ణకు సీఎం సహాయనిధి నుంచి రూ.4 లక్షల చెక్కును శుక్రవారం పర్చూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

80 మందికి చెక్కుల మంజూరు..

అద్దంకి/మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామానికి చెందిన నూతలపాటి రమణారావు కుంటుంబ సభ్యులకు శుక్రవారం రూ.18 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, సమన్వయకర్త ప్రతినిధి కావూరి రామశేషశర్మ ఉన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 80 మందికి రూ.2.5 కోట్లు సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు మంజూరైనట్లు నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి శుక్రవారం తెలిపారు. మరో 70 మందికి త్వరలో సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు మంజూరు చేయించనున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. వీరందరికీ త్వరలో చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



రాచపూడిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేస్తున్న నాయకులు

అభివృద్ధిని చేతల్లో చూపిన వైఎస్సార్ సీపీ



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త బాలాజీ

- ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన సమన్వయకర్త బాలాజీ

చినగంజాం: అభివృద్ధిని చేతల్లో చూపిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. మండలంలోని చినగంజాం-2 సచివాలయ పరిధిలో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనం, రాజుబంగారుపాలెం సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సభకు మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి శూన్యం అని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడ్డాక పేదవాడు మూడు పూటలా అన్నం తినగలుగుతున్నాడని అన్నారు. రాబోయే ఎన్నికలలో తనను పర్చూరు నియోజక వర్గం నుంచి శాసన సభ్యునిగా గెలిపిస్తే స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన తండ్రి పేరుతో ఉన్న ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందరినీ ఆదుకుంటానన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగాను, నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని తిరిగి రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యూబీ వరప్రసాద్, ఏఈ పీఆర్ దాసు, ఏఓ బీ భాస్కర్‌రావు, వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అసోది బ్రహ్మానందరెడ్డి, కేవీ సుబ్బారావు చౌదరి, టీఎస్సార్ ఆంజనేయులు, కుర్రి రామసుబ్బారావు, నూనె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు, పాదర్తి ప్రకాష్, వీవీఆర్ ప్రసాద్, ఎస్ జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దైవ సేవకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ

క్రైస్తవులను ఆదుకున్న ప్రభుత్వం..

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో క్రైస్తవులకు గౌరవం తెచ్చి పెట్టిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి బాలాజీ అన్నారు. పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి దైవసేవకుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పేదల కోసం సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పేదవాడు బతికి బట్టకట్టాలంటే తిరిగి రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో దైవసేవకులు డేవిడ్ మనోహర్, షాలెం రాజు,పూర్ణిమెట్ల జాన్‌బాబు. జోసెఫ్, శాంతి బాబు. జీవన్ కుమార్,జాన్సన్ బాబు. మేరి సోనియా, నాయకులు కోట శ్రీనివాసరావు, దాసరి వెంకట్రావు, గాజుల రమేష్, ఆకుల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం-మా బూత్ సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌రెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలంలోని తంగేడుమల్లి గ్రామంలో మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కైపు మహేష్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించడం అధికారుల బాధ్యత



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ రవీందర్

పర్చూరు (చినగంజాం): బాధ్యతాయుతంగా ఎన్నికలు నిర్వహించడం అధికారులందరి బాధ్యతని బాపట్ల ఆర్డీఓ, పర్చూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ అన్నారు. శుక్రవారం పర్చూరులో కూనపరెడ్డి ప్రమీలారాణి డిగ్రీ కాలేజీలో నియోజక వర్గ పరిధిలో నియమించిన పలు కమిటీలకు శిక్షణ కార్యక్రమాన్ని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు నియోజక వర్గ పరిధిలో రాబోయే ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు నియమించిన కమిటీలు సక్రమంగా పనిచేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో వీడియో సర్వైవర్ టీం, ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం, స్టాటిక్ సర్వైవల్ టీం, వీడియో వ్యూయింగ్ టీం, పోలీఉఓస్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

అక్రమ విద్యుత్ వినియోగం నేరం



వినియోగంపై విలేకర్లతో మాట్లాడుతున్న అధికారులు

కారంచేడు: గృహ, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఒంగోలు, చీరాల ఈఈలు కే వెంకటేశ్వర్లు, కే జాన్ థామస్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామాల పరిధిలో ఒక్కసారిగా తనిఖీలు నిర్వహించారు. 39 బృందాలను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాల పరిధిలోని విద్యుత్ సర్వీసులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టామన్నారు. వీటిలో 2940 గృహాల్లోని విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయగా వీటిలో 100 గృహాల్లో అక్రమంగా అధిక లోడ్‌తో విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు తమ సిబ్బంది గుర్తించారన్నారు. 100 సర్వీసుల యజమానులకు రూ.6.86 లక్షలను పెనాల్టీ విధించామన్నారు. అనంతరం వారు కారంచేడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో చీరాల, పర్చూరు, వేటపాలెం డిప్యూటీ ఈఈలు టీ శ్రీనివాసరావు, ఎస్ రమేష్‌బాబు, జే శ్రీనివాసులు, తొమ్మిది మంది ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టం రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు

అద్దంకి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను రద్దు చేయాలని సీపీఎం ప్రకాశం జిల్లా నాయకుడు జీవీ కొండారెడ్డి అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సీఏఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అద్దంకిలో ముస్లిం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక భవాని సెంటర్ నుంచి బంగ్లా రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. జిల్లా నాయకుడు జీవి కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం, మైనార్టీల పట్ల నిరంకుశ వైఖరి అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు అత్యధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతాల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక సాయి అపార్ట్‌మెంట్ సమీపంలోని ఓ సిమెంట్ బెంచి మీద అనుమానాస్పద స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి బెంచి మీద పడుకొని ఉన్న పురుషుని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తి వీధుల వెంట తిరుగుతూ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి విక్రయించే వ్యక్తిగా ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. మృతుని మొహంపై రక్తపు చారికలు కనిపిస్తూ ఉండటం గమనార్హం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జే.పంగులూరు: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణరెడ్డి కోరారు. మండలంలోని నూజిల్లపల్లి, చందలూరు, గ్రామాల్లో గురువారం రాత్రి కేంద్ర బలగాలతో కలిసి రూట్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చేతిలో బలమైన ఆయుధం ఓటు అని పేర్కొన్నారు. మంచి అభ్యర్థిని ఎన్నుకోవటానికి ప్రజలు ఎలాంటి భయాలకు లోనవాల్సిన అవసరం లేదని ఎవరి ఓటు వారే వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి గొడవలు, ఆందోళనలు, దాడులు జరగకుండా ఉండేందుకు పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తారని, మండల ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రేణింగవరం ఎస్సై తిరుపతిరావు, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పంట దిగుబడి ప్రయోగాలతో రైతులకు మేలు

వేటపాలెం: పంట కోత ప్రయోగాలతో రైతులకు మేలు జరుగుతుందని ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని బచ్చులవారిపాలెంలోని వరి పొలంలో పంట కోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల వలన రైతు సరాసరి దిగుబడి గ్రామ సరాసరి దిగుబడి, రాష్ట్ర సరాసరి దిగుబడి అంచనా వేయుటకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ దిగుబడి అనుసరించి వ్యత్యాసం ఉంటే రాష్ట్ర సరాసరి దిగుబడి నుంచి ఉన్నటువంటి వ్యత్యాసానికి ఉచిత పంటల బీమా వర్తింపు జరుగుతుందని చెప్పారు. ఉచిత బీమా ఈ-క్రాప్‌కి అనుసంధానంగా ఉంటుందన్నారు. పంటలు సాగు చేసే రైతులందరూ తమ పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



వరి ధాన్యం తూకం వేస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వైఎస్సార్ టీఎఫ్‌కు ప్రభుత్వ గుర్తింపు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వటం పట్ల అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సురేష్, దండమూడి శాంతారావు హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ గుర్తింపు కోసం కృషి చేసిన శాసన మండలి సభ్యులు టీ కల్పలతారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,రామచంద్రారెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పీ అశోక్ కుమార్ రెడ్డి,గడ్డం సుధీర్, కే జాలిరెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి రేణుకారావు, కట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడు జగనన్నకు అండగా ఉండాలి



లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న నాయకులు

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిచేకూరి, ఆర్థికంగా బలపడిన ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉంటున్నారని మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు అన్నారు. మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో శుక్రవారం మండల నాయకులు ప్రతి గడపకు వెళ్లి కుటుంబానికి జరిగిన లబ్ధి వివరించి బ్రోచర్ అందించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఇంటింటి వద్ద ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని గ్రామస్తులు చెప్పన్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల స్పందన చూస్తుంటే రాష్ట్రంలో జగనన్న 175 కి 175 సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని గోగులమూడి ఏసుమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, గ్రామ సర్పంచ్ ఇస్తర్ల మార్తమ్మ, గ్రామ ఉపసర్పంచ్ గాదే బ్రహ్మారెడ్డి, గృహసారథులు ఉప్పతళ్ల అంకమ్మరావు, ఆలకుంట శ్రీలక్ష్మి గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

170 మందికి వైద్య పరీక్షలు

వేటపాలెం: మండల పరిధిలోని పాపాయిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్ష స్కీమ్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక క్యాంప్‌లో 170 మందికి వైద్యపరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష-2ను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. రక్తపరీక్షలు, ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మంది అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఐ కాశీవిశ్వనాథ్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షల కోసం ఓపీ నమోదు చేయించుకుంటున్న వృద్ధుడు